# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-03-2026　　　　　　　సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.
- ❖ వైమానిక అనుసంధానం పెరిగిన ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా, విస్తృతంగా జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ భారతదేశం సాధిస్తున్న అభివృద్ధి తన సొంత శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- ❖ హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో 130 మంది మావోయిస్టులు ఈ రోజు లొంగిపోయారు.
- ❖ ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ రేపు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు సమాజానికి, దేశానికి పునాది వంటి వారని అన్నారు. విద్యావంతులు, స్వయం సమృద్ధి గల సాధికారత కలిగిన మహిళలు ఉన్నప్పుడే దేశం సంపన్నంగా ఉంటుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. విద్య, విజ్ఞాన శాస్త్రం, క్రీడలు, కళలు, రక్షణ వంటి వివిధ రంగాలలో మహిళలు తమ ప్రతిభను, శ్రమించే తత్వాన్ని నిరూపించుకున్నారని ద్రౌపది ముర్ము కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వైమానిక అనుసంధానం (Air Connectivity) పెరిగిన ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా, విస్తృతంగా జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాజస్థాన్‌లోని కొత్త కోట-బుండి గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం భూమిపూజ

సందర్భంగా ప్రధాని దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఈరోజు ప్రసంగించారు. 2014 కంటే ముందు భారతదేశంలో కేవలం 70 విమానాశ్రయాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 160కి దాటిందని గుర్తు చేశారు. విమానాశ్రయాల ఏర్పాటు వల్ల చిన్న పట్టణాల్లో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభిస్తుందని, పర్యాటకం మెరుగుపడి, ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కొత్త విమానాశ్రయం కోట, చుట్టుపక్కల ప్రాంతాల పురోగతికి నూతన మార్గాలను తెరుస్తుందని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ రేపు న్యూఢిల్లీలో మహిళల నేతృత్వంలో 'శక్తి వాక్' ను నిర్వహిస్తోంది. ఉదయం 7 గంటల 30 నిమిషాల నుండి 10 గంటల వరకు ఇండియా గేట్ నుండి కర్తవ్య పథ్ మీదుగా విజయ్ చౌక్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఈ నడక సాగుతుంది. వివిధ రంగాలలో మహిళల నాయకత్వాన్ని, వారి కృషిని గౌరవిస్తూ... మహిళల సాధికారత, వారి రక్షణ పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటి చెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన మహిళా నాయకులు, 150కి పైగా కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, వివిధ సంస్థల నుండి దాదాపు 3 వేల మంది మహిళలు ఇందులో పాల్గొంటారని అంచనా.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సరిహద్దు గ్రామాలను అభివృద్ధి చేస్తూ... అక్కడ నుండి వలసలను నిరోధించడానికి "వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్" అమలు చేస్తున్నామని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు హరిద్వార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్తరాఖండ్ ఇప్పుడు పోరాటాల దశను దాటి, అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతోందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఆక్రమణలు, చొరబాట్లపై కఠినమైన చర్యలు కొనసాగుతున్నాయని అమిత్ షా తెలియజేస్తూ...

(వాయిస్ 15 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో 130 మంది మావోయిస్టులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈరోజు లొంగిపోయారు. వీరు తమ వద్ద ఉన్న భారీ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సామూహిక లొంగుబాటును ప్రజాస్వామ్యానికి లభించిన గొప్ప విజయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో అంతర్జాతీయ సంతాల్ కౌన్సిల్ నిర్వహిస్తున్న 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు పాల్గొని ప్రసంగించారు. సంతాల్ తెగ సంస్కృతి, భాష, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇటువంటి సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇతర దేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలలో భారత్ తన జాతీయ ప్రయోజనాల విషయంలో గానీ, సంబంధిత భాగస్వాముల సున్నితమైన అంశాల విషయంలో గానీ ఎక్కడా రాజీ పడలేదని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న `రైసినా డైలాగ్ -2026` సదస్సులో ముగింపు రోజైన ఈ రోజు ఆయన  పాల్గొని ప్రసంగించారు. అన్ని వాణిజ్య ఒప్పందాలలో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటూనే... అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాల కోసం తలుపులు తెరిచిందని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో భారతదేశం ఒక ఆత్మవిశ్వాసం కలిగిన దేశంగా ఎదిగిందని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం సాధిస్తున్న అభివృద్ధి తన సొంత శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుందని, ఇతరులు చేసే తప్పులపై కాదని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. న్యూ ఢిల్లీలో ఈరోజు జరిగిన `రైసినా డైలాగ్ -2026` లో 'హార్ట్ ఆఫ్ ద సీస్ : ఫ్యూచర్ ఆఫ్ ది ఇండియన్ ఓషన్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భారత్ ఎదుగుతున్న దిశ చాలా స్పష్టంగా ఉందని, దానిని ఎవరూ అడ్డుకోలేరని కేంద్రమంత్రి పేర్కొన్నారు. భారత్ ఎదుగుదల వల్ల హిందూ మహాసముద్ర తీర దేశాలన్నీ ప్రయోజనం పొందుతాయని, ముఖ్యంగా భారత్‌తో కలిసి పనిచేసే దేశాలకు మరిన్ని లాభాలు చేకూరుతాయని జైశంకర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ రేపు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు భారత్ రెండు సార్లు టీ 20 ప్రపంచ కప్ గెలవగా, న్యూజిలాండ్ 2021లో ఫైనల్ కు చేరి రన్నరప్ గా నిలిచింది.

ఇదిలా ఉండగా ఈ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఒక ప్రత్యేక రైలును నడపాలని నిర్ణయించింది. ఈ రైలు ఈరోజు రాత్రి 11 గంటల 45 నిమిషాలకు న్యూఢిల్లీ నుండి బయలుదేరి రేపు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు సబర్మతి చేరుకుంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నైపుణ్యం కలిగిన దేశ యువశక్తి వల్ల భారత్ ప్రపంచ స్థాయి సామర్థ్య కేంద్రం (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) హబ్‌గా మారిందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. బెంగళూరులో దృశ్య మాధ్యమ విధానంలో ఈ రోజు జరిగిన "ఎయిర్‌బస్ ఇండియా టెక్నాలజీ సెంటర్" ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ప్రయాణించే ఎయిర్‌బస్ కు అవసరమైన కీలక వ్యవస్థలను దేశీయ ప్రతిభతోనే రూపకల్పన చేస్తారని కేంద్రమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జన్ ఔషధి దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దేశ ప్రజలకు సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా సరసమైన ధరలకే మందులు అందడం వల్ల ప్రజలకు సరైన చికిత్స అందుతోందని, లెక్కలేనన్ని కుటుంబాలు తమ ఆరోగ్య సంరక్షణ ఖర్చులను ఆదా చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పౌరులందరికీ నాణ్యమైన మందులను తక్కువ ధరలకే అందుబాటులోకి తీసుకురావాలనే ప్రభుత్వ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనమని ప్రధానమంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =